మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# కంటి వెలుగు స్క్రీనింగ్ పరీక్షలు పెంచాలి..

**నెలాఖరునాటికి 2500 ఎకరాలో ఆయిల్‌పామ్, తోటల పెంపకాన్ని పూర్తి చేయాలి:మహబూబ్‌నగర్ కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశం**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 15 ప్రభాతవార్త :** కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా రోజువారి నిర్వహించే కంటి పరీక్షల సరాసరిని పెంచాలని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో జిల్లా అధికారులతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. కంటి వెలుగు స్క్రీనింగ్ సరాసరిని పెంచడంతో పాటు,ప్రిస్క్రిప్షన్ అద్దాలపంపిణీని కూడా పెంచాలని ఆదేశించారు. కంటి వెలుగులో భాగంగా ఇప్పటివరకు ఆయా టీములవారిగా ఎంతమందిని పరీక్షించారు? ప్రతిరోజు ఎంతమందికి రీడింగ్ అద్దాలు, ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఇచ్చారు? వంటి వివరాలను తక్షణమే సమర్పించాలని డిఎంహెచ్‌ఓను ఆదేశించారు. టీముల వారిగా, ప్రోగ్రాం అధికారి వారిగా పిహెచ్‌సి వారిగా కంటి వెలుగు కార్యక్రమాన్ని సమీక్షించనున్నట్లు వెల్లడించారు. కంటి వెలుగు వైద్య శిబిరాలకు ప్రజలు వచ్చే విధంగా డిఆర్‌డిఓ, డిడబ్ల్యుఓ, డిపిఓ ఇతర సంబంధిత శాఖల అధికారులు చైతన్యం చేయాలని పోడు భూములపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ పోడుభూములపై వచ్చిన అన్ని దరఖాస్తులను మరోసారి పున: పరిశీలించి తనకు సమర్పించాలని, జిల్లా స్థాయిలో ఆమోదించిన కేసులకు సంబంధించిన పాస్‌బుక్కులు సిద్ధం చేసి ఉంచాలని చెప్పారు. ఆయిల్‌పామ్ తోటల పెంపకంలో భాగంగా జిల్లాలో 3 వేల ఎకరాలలో పెంచాలని లక్ష్యంగా నిర్దేశించిన విషయం తెలిసిందేనని, అయితే ఈ నెలాఖరు నాటికి 2500 ఎకరాలలో పూర్తిస్థాయిలో డ్రిప్ మెటీరియల్‌తో పాటు, ప్లాంట్ మెటీరియల్, మొక్కలు నాటడం పూర్తిచేయాలని చెప్పారు. ఎక్కడైనా ప్లాంట్ మెటీరియల్‌లో ఉన్న ఇబ్బందులను తొలగించి నెలాఖరునాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలో 87 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా తీసుకోవడం జరిగిందని అధికారులు తెలుపగా, నర్సరీ వారిగా, మొక్కల వారిగా తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే సీజన్‌లో పొలం గట్లు ఇతర సరిహద్దుల్లో వెదురుబొంగుల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నర్సరీలో మొక్కల నిర్వహణ, అదేవిధంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని నీరు పోయడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆయన ఆదేశించారు. సాంఘిక సంక్షేమ హౌస్ సైట్‌లకు సంబంధించిన ఇప్పటివరకు హౌస్ సైట్‌లకు సేకరించిన, నిర్ధారించిన భూములను ధరణిలో ప్రభుత్వ భూమిగా కనిపించే విధంగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.పట్టణ ప్రాంతంలోని పిఎంఎవై ఇళ్ల విరాలను అప్‌లోడింగ్‌లో కొంత పురోగతి ఉన్నప్పటికి ఇంకా వేగవంతం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిఆర్‌డిఓ యాదయ్య, డిఎఫ్‌ఓ సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ఈఈ వైద్యం భాస్కర్, ఆర్డీఓ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డిడి పాండు,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్,జిల్లా వైద్యారోగ్య అధికారి డా. కృష్ణ, ఉద్యానశాఖ డిడి సాయిబాబా, వ్యవసాయ శాఖ ఎడి వెంకటేష్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

# దళారులను నమ్మి మోసపోవద్దు..!

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 15 ప్రభాతవార్త :** ధరణి సమస్యలు, ఇతంత్రా పనులు చేయిస్తామని చెప్పే దళారుల చేతిలో ప్రజలు మోసపోవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలి పారు. ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఉన్న సమస్యలను కలెక్టరేట్‌లో మాట్లాడి పరిష్కారమయ్యేవిధంగా చూస్తామని ఎవరు చెప్పిన ప్రజలు నమ్మవద్దని తెలియజేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో సమస్యలు ఫిర్యాదు చేయాలని, ఇప్పటికే చాలామంది సమస్యలు తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. తన పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించడం జరిగిందన్నారు. కొంతమంది దళారులు కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడాము, పని చేయిస్తామని ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వ్యక్తులను నమ్మవద్దని హెచ్చరించారు. తమ సమస్యలను నేరుగా కలెక్టరేట్‌కు వచ్చి విన్నవించుకోవచ్చున్నారు. ఎవరైనా మోసం చేసినట్లు తన దృష్టికి వస్తేచట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని, సమస్యలతో వచ్చిన ఆర్జీదారునికి సలహాలు, సూచనలు అందించడంతో పాటు సమస్యలను సత్వరమే పరిష్కరించేటట్లు కృషి చేస్తామన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3.30 గం.ల నుండి 5 గం.ల వరకు సందర్శకులకు సమయాన్ని సైతం కేటాయించడం జరిగిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## క్షేత్ర స్థాయిలో ప్రగతిని సూచించేలా

# క్షేత్ర స్థాయి అధికారులు పర్యటనలు ఉండాలి...

**- ఏపీడీ సస్పెన్షన్, ఏపీఓకు షోకాస్ నోటీస్‌కు కలెక్టర్ ఆదేశం**

**- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 15 ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయిలో పర్యటించే అధికారులు తమ పర్యటనలతో ప్రగతిని సూచించేలా పర్యటనలు ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉపాధి పథకం అమలు, స్త్రీ స్వయం సహాయ బృందాల ఏర్పాటుకు ప్రోత్సాహం, వాటి పనుల అనుసంధానం, బ్యాంక్ సహాయంతో పేదరిక నిర్మూలన పథకం, హరితహారం నర్సరీల నిర్వహణ, ఉపాధి కూలీల మొబిలైజేషన్ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తదితర పనులపై అదనపు కలెక్టర్ మనుచౌదరితో కలిసి జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్ మాస్టర్ జనరేషన్ పనులు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై జిల్లా కలెక్టర్ అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులను నిర్లక్ష్యం వహిస్తున్న ఏపీడీ చంద్రశేఖర్‌ను సస్పెన్షన్ చేయాలని డీఆర్డీఏ పీడీని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అచ్చంపేట ఏపీఓ పర్వతాలుకు షోకాస్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సందర్శించిన ప్రాంతాల్లో సందర్శించిన సందర్భంగా సూచించిన పనులు ఏ విధంగా జరిగాయో లేదు అని తెలుసుకొని అసహనం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకపోతే తీవ్ర స్థాయిలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించి పనులపై నిర్లక్ష్యం వహిస్తున్న వారిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ప్రతి మాసం పురోగతిపై సమీక్షా ఉంటుందని, వచ్చే సమావేశం నాటికి పురోగతి పెంచాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మనుచౌదరి, పీడీ డీఆర్డీఎ నర్సింగరావు, ఏఓ నటరాజ్, అదనపు పీడీ లక్ష్మినారాయణ, డీపీఎం అరుణ, డీఆర్డీఎ ఆధ్వర్యంలో పనిచేసే క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్

# గుర్తు తెలియని కారు ఢీకొని ఇద్దరు రైతుల మృతి...

**కల్వకుర్తి, మార్చి 15 ప్రభాతవార్త:**కల్వకుర్తి-నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై తుర్కలపల్లి గేటు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు రైతులు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... తుర్కలపల్లి గ్రామానికి చెందిన పల్లె రామస్వామి (45), బొడిగే దుర్గయ్య(40)లు గ్రామంలో నుంచి ద్విచక్ర వాహనంపై పొలం పనులకు వెళ్తున్న తరుణంలో నాగర్‌కర్నూల్ వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ప్రమాదంలో రామస్వామి, దుర్గయ్యలు అక్కడికక్కడే మృతి -మిగతా4లో..



మృతి చెందిన పల్లె రామస్వామి



మృతి చెందిన దుర్గయ్య

# ఒత్తిడిని అదిగమిస్తే.. విజయం మనదే..!

**• పరీక్షల వేళ భయం వద్దు..**
**• భయంతో మెదడు మొద్దుబారే అవకాశం..**
**• సాధనదిశగా ముందుకు సాగాలి..**
**• లక్ష్యం నూతన ఉత్సాహాన్ని నింపుతుంది..**
**• పరీక్షల సమయంలో నిద్ర,సమతుల ఆహారం అవసరం**

పది,ఇంటర్,డిగ్రీ చదివే అనేక మంది విధ్యార్థులు పరిక్షలు దగ్గరపడుతున్న కొద్ది ఒత్తిడికి గురవుతున్నారు.ఇలా ఒత్తిడి కొనసాగితే కష్టపడి చదివింది కూడ గుర్తుకురాదు. పరిక్షలు సరిగ్గా రాయలేకపోతామనే భావన వారిని మరింత భయపెడుతుంది.ఇది విధ్యార్థి స్వయంగా సృష్టించుకోనే ఒత్తిడి. పాఠ్యాంశాల క్లిష్టత,జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలు ఒత్తిడిని పెంచుతాయి.పరిక్షలు అనగానే చలా మంది విధ్యార్థులు భయంతో మెదడు మొద్దుబారిపోతుంది. ఈ పరిస్థితిలో విధ్యార్థులు చదువలేరని సైకాలజిస్టులు, విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో జరుగుతున్న ఇంటర్,రాబోయే పదవతరగతి పరిక్షల సందర్భంగా తల్లితండ్రులు విధ్యార్థులు పాలించాల్సిన వాటి గురించి వారు పలు సూచనలు ఇస్తున్నారు. **దేవరకద్ర,మార్చి 15 ప్రభాతవార్త:**



**ఇతరులతో పోల్చుకోవద్దు..**

చదువుకొనేటప్పుడు ఇతరులతో ఎప్పుడేగాని పోల్చుకోవద్దు.అలా పోల్చుకోవడం వల్ల అత్మన్యూనతాభావం వస్తుంది.దాంతో అసూయ, ఈర్శ్య కూడ వచ్చే అవకాశం ఉంది. వ్యక్తులతో కాకుండా గతంలో మీరు చదివిన విధానాన్ని, ఇప్పుడు చదువుతున్న విధానాన్ని పోల్చుకోవాలి. మీ సామర్థ్యాన్ని ఎప్పుడూ కూడ తక్కువగా అంచనా వేసుకోకూడదు.మీరు మీ కుటుంబం కోసమో,చదివే విధ్యాసంస్థ కోసమో,మీ మీద ఉపాధ్యాయులు పెట్టుకొన్న అంచనా కోసమో చదువడం లేదు.మీరు మీ ఉజ్వల భవిష్యత్తుకోసం చదువుతున్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగడానికి ప్రయత్నించాలి. అప్పుడు తప్పక విజయం సాదించగల్గుతారు.

**ఒత్తిడిని అదిగమించాలి..**

పరిక్షల ఒత్తిడిని అధిగమించడానికి విశ్వాసం, పట్టుదల,సంకల్పం,ఏకాగ్రత పునాదులపై విజయసాధనాన్ని నిర్మించుకోవాలి.గతంలో ఎప్పుడో తక్కువ వచ్చిన మార్కులు వచ్చినంత మాత్రాన ఎప్పుడూ అలగే రావు అన్న విషయాన్ని గ్రహించాలి.తక్కువ మార్కులు రావడానికి గల కారణాలను మాత్రమే విశ్లేషించుకోవాలి.తప్పులు చేసినట్లు అనిపిస్తే వాటిని తిరిగి చేయకుండా జాగ్రత్త పడాలి.

**క్రమపద్ధతిలో చదువాలి..**

పాఠ్యాంశాన్ని క్రమపద్ధతిలో చదువుతూ ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకొంటుండాలి.ఒక్కో ఆధ్యాయం చదివి..చూడకుండా రాసుకొంటే మీ మీద మీకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.నేనే చేయగలను అన్న నమ్మకం అత్యవిశ్వాసాన్ని పట్టుదల పెంచుతుంది.

**స్వష్టమైన లక్ష్యం అవసరం.**

రాబోయే పరిక్షల్లో ఎన్ని మార్కులు సాదించాలనుకొంటున్నారో..ముందుగానే నిర్ణయించుకోవాలి.లక్ష్యం మీలో నూతన ఉత్సాహాన్ని నింపుతుంది.

స్పష్టమైన లక్ష్యం,ప్రణాళికతో ముందుకు దూసుకపోవాలి.అప్పుడే అనుకొన్న గమ్యానికి సునాయసంగా చేరుకొంటారు.మంచి నిద్ర,సమతుల ఆహారం,అకుకూరలు.పండ్ల రసాలు తీసుకోవడం ద్వారా శక్తి వస్తుంది. అనుకొన్న పని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలంటే దాన్ని కాగితం పై రాసుకొని అధ్యయనం చేయాలి.రోజూ దానిని చూస్తుండాలి.అది కర్తవ్యాన్ని గుర్తుచేసి లక్ష్యసాధన దిశగా ప్రేరేపిస్తుంది.

**నేర్చుకొంటే అన్ని సులువే..**

పరిక్షలు దగ్గరపడుతుంటే చదువని పాఠ్యాంశాలు భయపెడుతుంటాయి.చదువకుండా వాయిదా వేస్తే సమయం దగ్గరపడుతున్నా కొద్ది భయం ఎక్కువవుతుంది. కాబట్టి ఇప్పుడే మొదలు పెట్టండి.ఏదైన నేర్చుకునే వరకు కష్ఠంగా ఉంటుంది. నేర్చుకొంటే అన్ని సులువన్న విషయాన్ని గమనించాలి.

**చూడకుండా రాయిలి..**

చదివిన ప్రతిదీ చూడకుండా రాయాలి.పరిక్షల్లో తప్పులు లేకుండా రాసినదానికి మంచి మార్కులు వస్తాయి. రాస్తే సమయం వృధాకాదు.సాదన వల్ల సామాన్యులు అసామాన్యులుగా మారుతారు.పరిక్షలు దగ్గర పడుతున్న కొద్ది రెట్టింపు ఉత్సాహంతో చదువాలి.కష్టమైన సబ్జెక్టుకు ఎక్కువగా ప్రాముఖ్యతను ఇచ్చి ముందుగా పూర్తి చేయాలి.భయం వీడితే జయం మనదే అన్న విషయం గుర్తుచేసుకోవాలి.



# ఇంటర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీచేసిన కలెక్టర్



**గద్వాల ప్రతినిధి,మార్చి 15 ప్రభాతవార్త :** ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పరీక్షల నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా గద్వాలలోని జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. మొదటి సంవత్సరం 498 మంది విద్యార్థులలో 470మంది హాజరయ్యారని 28 మంది గైర్హాజరయ్యారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ నిర్వాహకులను ఆదేశించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంటర్‌మీడియట్ నోడల్ అధికారి హృదయరాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి..

**ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలి.. జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్**



**వనపర్తి ప్రతినిధి,మార్చి 15 ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని పరీక్ష నిర్వాకులను, సిట్టింగ్ స్క్వార్డులకు జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా జిల్లా ఇంచార్జీ కలెక్టర్ పట్టణంలోని స్కాలర్స్ కళాశాల, ఉర్దూమీడియం కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు. తాగునీరు, వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట డీఐఈఓ జాకీర్ హుస్సేన్, తహసిల్దార్ రాజేంద్ర గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మన్యంకొండ వద్ద రోప్‌వే ఏర్పాటుకు సన్నాహాలు..

**- రోప్‌వే సర్వీసు ప్రొవేడర్లతో సమావేశమైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**దేవరకద్ర,మార్చి 15 ప్రభాతవార్త:** జిల్లాలో పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద అతి పెద్ద రోప్‌వేను ఏర్పాటు చేయడానికి సన్నా హాలు ముమ్మరంగా జరుతున్నాయి. ఇదివరకే దేవస్థానం వద్ద మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక చొరవతో కొన్ని లక్షల రూపాయాలతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. అందులో భాగంగానే దేవస్థానం వద్ద రోప్‌వే ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నిర్ణయించారు. దీనికి గాను ఇదివరకే స్థలపరిశీలన కూడ మంత్రి సంబంధిత అధికారులతో పాటు దేవస్థానం అధికారులతో చేశారు.దిగువ కొండ నుండి గుట్టపైకి దాదాపు 3కిలో మీటర్ల ఘాటురోడ్డు ఉంది. దీంతో వృద్ధులు, చిన్నపిల్లల తల్లితండ్రులు స్వామి దర్శనానికి గుట్టపైకి వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు వచ్చారు.దీని వల్ల మన్యంకొండ ఇంకా పర్యాటక రంగంగా అభివృద్ధి చెందడానికి ఆస్కారమేర్పడుంది. గుట్టపైకి వెళ్ళే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తీసుకొన్న ఈ నిర్ణయానికి భక్తులు సంతోషం వ్యక్తపరు స్తున్నారు. మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**రోప్‌వే సర్వీసు ప్రొవేడర్లతో సమావేశమైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద అతి పెద్ద రోప్‌వేను ఏర్పాటు చేసే విషయంలో హైద్రాబాద్‌లోని తన చాంబర్‌లో బుధవారం కలకత్తా,ముంబైలకు చెందిన రోప్‌వే సర్వీసు ప్రొవేడర్లతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు విషయాలను చర్చించారు. మన్యంకొండ దేవస్థానం వద్ద రోప్‌వే ఏర్పాటుచేసే విషయంలో సాధ్యాసాధ్యాలను వారితో మంత్రి చర్చించారు. దేవస్థానం వద్ద ఈ రోప్‌వే ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్రంలోనే ఈ రోప్‌వే అతిపెద్ద,మొట్టమొదటి రోప్‌వే అవుతుందని మంత్రి అన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తగ్గినా.. గద్వాలలో పెరిగిన భూగర్భ జలమట్టం..

**సమర్థుడు పాలకుడైతే ఫలితం ఎలా ఉంటుందో ఇదో చిన్న ఉదాహరణ.. హర్షం వ్యక్తం చేస్తున్న యావత్ ప్రజానీకం**

**గద్వాల ప్రతినిధి,మార్చి 15 ప్రభాతవార్త :** గద్వాల తెలంగాణ రాష్ట్రం నీళ్ల నిధులు, నియామకాలు వంటి ప్రధాన అంశాలే లక్ష్యంగా స్వరాష్ట్రం సిద్ధించింది. మొదటిసారి ముఖ్యమంత్రి అయిన కెసిఆర్ సొంత రాష్ట్రం ఏర్పాటు కోసం పోరాటానికి ప్రధాన లక్ష్యంగా ఉన్న 2014లో చేపట్టిన అద్భుతమైన మిషన్ కాకతీయ పథకం కెసిఆర్ ప్రభుత్వం సాధించిన దూరదృష్టికి జిల్లాలో సత్ఫలితాలు ఇస్తున్నది. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే కరువు కాటకాలకు నిలయం గద్వాల ప్రాంతం. కరువుకు అడుగంటిపోయిన భూగర్భ జలాలతో రైతన్న,ప్రజలు అరిగోస పడ్డారు. ఉద్యమనేత కెసిఆర్ 2014లో సొంత రాష్ట్రంలో తీసుకున్న మిషన్ కాకతీయ (చెరువుల పూడికతీత) పథకం హరితహారం రాష్ట్రంలో ఎలా ఉన్నా గద్వాలలో మాత్రం అద్భుతమైన ఫలితాలు ఇస్తుంది. గొలుసుకట్టు చెరువులకు చిరునామాగా ఉన్న నడిగడ్డ ప్రాంతం చెరువుల పూడికతీత వల్ల లభించే ప్రయోజనాలను అందరికంటే ముందే పసిగట్టిన మన ప్రియతమ నేత, గద్వాల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అప్పట్లోని ప్రభుత్వం మాజీ మంత్రి జూపల్లి సహాయ సహకారాలతో గద్వాల నియోజకవర్గంలో చెరువుల పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. దాదాపు 100 శాతం చెరువుల్లో పనులను పూర్తి చేయించారు. సాగునీటి శాఖ అధికారులతో నిరంతరం సంప్రదిస్తూ చెరువులో పూడికతీత పనులు పూర్తి చేశారు.ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత కూడా సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ ఆయకట్టు రైతులను సమన్వయం చేస్తూ ఇరిగేషన్ పనులుపూర్తి చేయడం,సాగునీరు వృధాకాకుండా అవగాహన కల్పిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్నారు.ప్రభుత్వం చేపట్టిన విధానాల వల్ల ఉమ్మడి జిల్లాలో గద్వాల జిల్లాలో ఇప్పుడిప్పుడే సత్ఫలితాలు ఇవ్వడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా మిగతా జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి రైతులు సాగునీటి కోసం తల్లడిల్లే పరిస్థితి ఉన్నా ఒక గద్వాల ప్రాంతంలో మాత్రం భూగర్భ జలాలు ఆ గంగమ్మ తల్లి మరింత పైకి రావడం వెనక ప్రధాన కారణం ప్రభుత్వం పాలకుల ముందుచూపే ప్రధాన కారణం. జూరాల, నెట్టెంపాడు ప్రాజెక్ట పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు నింపేలా చూడడంతో పాటు ఆయకట్టు రైతులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సాగునీటి కింద సాగునీరు వృధా కాకుండా వారిని అప్రమత్తం చేయడం ఊహించిన దానికంటే ఫలితాలు ఇవ్వడం అత్యద్భుతం సమర్థుడు పాలకుడైతే ఫలితాలు ఇలాగే ఉద్యమ తరహాలో చేపట్టిన మిషన్ కాకతీయ, హరితహారం కార్యక్రమాలతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని, ఇందువల్ల వ్యవసాయ ఉత్పాదకత పెరిగింది. అభివృద్ధి పట్ల నిబద్ధత,భవిష్యత్తు విజన్ సాధించాలనే సంకల్పంతో పాటు ఆటుపోట్లను తట్టుకొని నిలబడే నిబ్బరం గల నాయకులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మనకుంటే ఫలితాలు సాక్షాత్కరిస్తాయని దానికి గద్వాలలో ఉబికివచ్చిన భూగర్భ జలాలకు మించిన ఫలితం ఉండదు. అన్నది నేడు మనకళ్ల ఎదుట కనిపిస్తున్న నగ్న సత్యమని, యావత్ ప్రజానీకం, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)



నదీ జలాలకుపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

# పెద్దమ్మ తల్లి మొక్కు తీర్చుకున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి..

**వనపర్తి ప్రతినిధి,మార్చి 15 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లో గల పెద్దమ్మ దేవాలయం లో తన మొక్కును చెల్లించిన రాష్ట్ర వ్యవసాయశాఖ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వాసంతి దంపతులు. సింగిరెడ్డి వాసంతి బోనం మోసి అమ్మవారికి వడిబియ్యం సమర్పించారు. ఈ సందర్భంగామంత్రి నిరంజన్ రెడ్డి తన మొక్కును తీర్చుకోవడమే కాకుండా నియోజకవర్గంలోని హైదరాబాద్ లో నివాసముంటున్న వనపర్తి నియోజకవర్గం ప్రజలతో పాటు వనపర్తి నియోజకవర్గ ముఖ్య నాయకులందరిని ఆహ్వానించి జిల్లా ఎమ్మెల్యేలను ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గంలోని 9వేల మంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్న నిరంజన్ రెడ్డి అభిమానులు ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభివాణిదేవి, జిల్లా వెంకటరామిరెడ్డి కసిరెడ్డి, నారాయణ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, గువ్వల బాలరాజు, రామ్మోహన్ రెడ్డి, జైపాల్ యాదవ్, వనపర్తి మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, మార్కెట్ చైర్మెన్ రమేష్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీ, ఎంపీపీలు, సింగిల్‌విండో అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

# విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి..

**ఉన్నత స్థాయికి చేరుకునేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలి**

**ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహ్మద్ ఉమర్**

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 15 ప్రభాతవార్త :** విద్యార్థులు చెడు వ్యసనాలు చెడు మార్గాల్లో నడవకుండా ఒక ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో చదువుకోవాలని నారాయణపేట జూనియర్ సివిల్ జడ్పి మహ్మద్ ఉమర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం మధ్యాహ్నం నారాయణపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల బహార్‌పేట్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయగా జూనియర్ సివిల్ జడ్జి పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లు, వ్యసనాలు దూరముగా ఉండాలని, చిన్నతప్పు వల్ల జీవితం నాశనమైపోతుందన్నారు. విద్యార్థులు ఒకలక్ష్యం పెట్టుకుని చదవాలని ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రతి ఒక్కరు కోరుకోవాలన్నారు. అందుకు తగ్గట్లుగా బాగా చదువుకోవాలని తెలిపారు. మార్కులు తక్కువ వచ్చాయని, పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని క్షణికావేశానికి గురై అఘాయిత్యం చేసుకోవద్దని, మార్కుల కంటే జీవితం ఎంతో గొప్పదని హితవు పలికారు. చదువుతోపాటు సామాజిక స్పృహ - మిగతా4లో..



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహ్మద్ ఉమర్

## ఎమ్మెల్సీ అభ్యర్థి చల్లా,మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసిన ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్మన్ బండారి భాస్కర్




**ఇటిక్యాల,మార్చి 15 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే కోటాకింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డిని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించగా ఈనెల 9న నామినేషన్ దాఖలు చేశారు. 23వ తేదీన పోలింగ్ జరగనుండగా బుధవారం హైదరాబాద్‌లోని చల్లా క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు జడ్పీ ఛైర్మన్‌గా పని చేసిన మాజీ జడ్పీ ఛైర్మన్ బండారి భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక ఇటీవల మంత్రి నిరంజన్‌రెడ్డి శస్త్ర చికిత్స నిర్వహించుకోగా ఆయనను మినిస్టర్ క్వార్టర్స్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జడ్పీ ఛైర్మన్ బండారు భాస్కర్ పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

## ఘనంగా ప్రీ స్కూల్ మేళ..

**ఉట్కూర్,మార్చి15 ప్రభాతవార్త :**మండలపరిధిలోని నిడుగుర్తి గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రం లో ఘనంగా ప్రీ స్కూల్ మేళాను నిర్వహించారు. చిన్నారి విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రత్యేక వేషధారణలో రావడంతో పాఠశాల కేంద్రం అంతా చూపరులను ఆకట్టుకునేలా ఆహ్లాదకరంగా ఉంది.



ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిన్నారులు ఉపాధ్యాయులుగా చూడముచ్చటగా రావడం వారి బుడి బుడి అడుగులతో పాఠశాల ఒక నందనవనంలా మారిపోయిందని అన్నారు. విద్యార్థులకు తొలిమెట్టు అంగన్‌వాడి కేంద్రం. అక్కడి నుండే వారి అడుగులు పాఠశాలకు దారితీస్తాయి. అంగన్‌వాడి కేంద్రంలో విద్యార్థులకు పాఠశాలలపై ఆసక్తి, ఉత్సాహం, గౌరవం, నడవడిక పైస్థాయి వరకు ఒక నిచ్చెనల జీవితంలో పైకి తీసుకు వెళ్తాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కృష్ణార్జున్‌రెడ్డి,అంగన్‌వాడి టీచర్ జ్యోతి, లక్ష్మి,కార్యకర్తలు మల్లమ్మ, కిష్టమ్మ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న హత్ సే హత్ జోడో అభియన్...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 15 ప్రభాతవార్త:**ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు తిమ్మాజిపేట మండలం అమ్మపల్లి గ్రామంలో హత్ సే హత్ జోడో అభియాన్ పాదయాత్రను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అభియాన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ నాగం శశిధర్‌రెడ్డి హాజరై హత్ సే హత్ జోడో అభియాన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని గడప గడపకు ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడు లేనటువంటి ఎప్పుడు చూడని, కని విని ఎరుగని విధంగా రాహుల్‌గాంధీ



చేపట్టినటువంటి భారత్ జోడో పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయేటటువంటి యాత్ర అని ఆయన పేర్కొన్నారు. దేశంలో విభజించి పాలించే ఈ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరితో ప్రేమ స్నేహపూర్వకంగా కలిసి మెలిసి జీవించి దేశ ప్రజలందరు ఏకతాటిపై నడవాలన్నారు.అంతకు ముందు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ గావించారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో బొడ్రాయి ఉత్సవాలు

**వెల్దండ, మార్చి 15 ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని రాఘాయిపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట పూజా కార్యక్రమాలు గత రెండు రోజుల నుంచి భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం వేద పండితులచే గణపతిపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధరణ, రక్షా బంధన్, యాగశాల ప్రవేశం, దేవాతహవాహణం, నీరాజనం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ట, మహాగణపతిహోమం, జలాధివాసం, ప్రద్యూష పూజ, మంత్రపుష్పధుల తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అచ్చాలు రాములు, చైర్మన్ బుచ్చిరెడ్డి , కొండలుయాదవ్, బాలయ్య, సుధాకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, ఈదన్న, సంజీవ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, భీమ్లానాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

**వెల్దండ, మార్చి 15 ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 146 మంది విద్యార్థులకు గాను 144 మంది హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరైనట్లు సీఎస్ విజయలక్ష్మి తెలిపారు. మోడల్ కళాశాలలో 245 మంది విద్యార్థులకు గాను 238 మంది హాజరైనట్లు సీఎస్ పుష్పలత తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ చంద్రశేఖర్, ఫ్లయింగ్ సా ్క్వడ్‌లు సందర్శించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కల్వకుర్తి, మార్చి 15 ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపాలిటిలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన పోలే బాలరాజు మంగళవారం రాత్రి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గోరటి శ్రీనివాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రావుల చెన్నకేశవులు, కనుక సత్యనారాయణ, దున్న సురేష్ తదితరులు ఉన్నారు.



## జలాధివాస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి దంపతులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 15 ప్రభాతవార్త:**శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ శ్రీధరాచార్య స్వామిజీ మహారాజ్ వారి కరకమలముచే నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమని జమునరెడ్డిలు నిర్మించిన 28 కోట్ల లిచత శ్రీరామ నామ స్థూపా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి స్థూపంలో ప్రతిష్టించే శ్రీ సీతారామచంద్రస్వామి, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు నిర్వహించిన జలాధివాస్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి..

**మక్తల్,మార్చి15 ప్రభాతవార్త:** వేసవికాలం ప్రారంభం అయినందున జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ వనజమ్మ సూచించారు. బుధవారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం నారాయణపేటలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ కోడ్ ఉన్న సందర్భంలో పూర్తిస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించి తీర్మాణాలు చేయడం లేదని అయినప్పటికిని ఆయా శాఖల ప్రగతి నివేదికలు చదివించి శాఖా పరంగా ఉన్న సమస్యలను జడ్పీటిసిలు లేవనెత్తారు. గ్రామీణాభివృద్ధిశాఖ, మిషన్ భగీరథ, ఇంట్రాగ్రిడ్, పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ, పశ సంవర్ధకశాఖ, మత్స్యశాఖ,అటవి శాఖల నివేదికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభం అయినందున ఎక్కడ తాగునీరు సమస్య లేకుండా చూడాలని, ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే వారం లోపల పరిష్కరించాలని ఇంట్రా ఈఈని ఆదేశించారు. వైస్ ఛైర్మన్ జి. సురేఖ మాట్లాడుతూ మరికల్ మండలంలో చాలాచోట్ల మిషన్ భగీరథ నీరు రావడం లేదని, 9,10 వార్డుల్లో అసలు నల్లాలు బిగించలేదని సభా దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఈఈ ఇంట్రా క్షేత్రస్థాయిలో పరిశీలించి వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలియజేశారు. పంచాయతీరాజ్ శాఖ సమీక్ష సందర్భంగా కోస్గి జడ్పీటిసి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు గత 4 నెలల నుండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్

జీతాలు రావడం లేదని త్వరగా జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ సెక్రెటరీ ఉన్నప్పటికిని గ్రామాల్లో కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు అనుమతులు మంజూరు చేయడం, ట్యాక్స్ వసూలు చేయడం వంటివి జరగడం లేదని తద్వారా గ్రామ రెవెన్యూ కోల్పోతుందని సభా దృష్టికి తెచ్చారు. స్పందించిన డిపిఓ మురళి బిల్లులు ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని ఏ క్షణంలో అయినా జీతాలు వారి ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. పశుసంవర్ధకశాఖ సమీక్ష సందర్భంగా జడ్పీ వైస్‌ఛైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు చికిత్సకై వెళ్లినప్పుడు మందులు అన్ని బయటికి రాస్తున్నారని, శాఖాపరంగా ఎలాంటి మందులు రావడం లేదా అని ప్రశ్నించారు. స్పందించిన డివిహెచో మందులు ఆరోగ్య కేంద్రం ద్వారానే ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఏవైనా అందుబాటులో లేని మందులు ఉంటే బయటికి రాసి ఉంటారని సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటిసిలు, కో ఆప్షన్ సభ్యులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

# నిఖిత చావుపై న్యాయ విచారణ చేయాలని రాస్తారోకో..

**- సిట్టింగ్ జడీచే న్యాయ విచారణ చేయాలి - అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్**

**అచ్చంపేట, మార్చి 15 ప్రభాతవార్త:**అమ్రాబాద్ మండలం మణుగూరు బాలికల ఎస్సీ గురుకులంలో ఆత్మహత్య చేసుకున్న నిచత విద్యార్థిని పట్ల న్యాయ విచారణ జరిపించాలని అచలపక్ష పార్టీలు కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ, ఎమ్మార్పీఎస్‌లతో పాటు ప్రజా సంఘాల సభ్యులు బల్మూర్ మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన మున్ననూరు గురుకులంలోని ఎస్సీ బాలికల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నిచత ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందనేది తెలియాల్సినటువంటి అవసరం ఉందన్నారు. అమ్మాయి బెంచ్‌పై ఎక్కి చెయ్యి పైకి ఎత్తిన ఫ్యాన్ అందడం లేదని, అలాంటిది ఆమె చున్నితో ఆత్మహత్య ఎలా చేసుకుందని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో చితకబాది హత్య చేశారనే ఆరోపణలు వస్తున్నాయి, అలాంటి విషయాల పట్ల పూర్తి స్థాయిలో విచారణ చేసి వాస్తవాలను వెలికితీయాలని రాష్ట్ర సర్కార్‌ను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అచల పక్ష పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు దేశ్యానాయక్, శంకర్‌నాయక్, కాశన్నయాదవ్, వెంకట్‌రెడ్డి, పెద్దయ్యయాదవ్, ఖదీర్, లాల్ మొహమ్మద్, ఆంజనేయులు, బాలీశ్వరయ్య, వెంకటయ్య, లక్ష్మేశ్వర్, మహేష్, గుంట విజయ్, రాజు, ఉదయ్, దేవేందర్, రవి తదితరులు ఉన్నారు.


రాస్తారోకో చేస్తున్న అఖిల పక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు

# అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం..

**కల్తీ సర్వమయం తెలుసుకోకపోతే చావు ఖాయం**

**నాసిరకం అనిపిస్తే వెంటనే హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి**

**జిల్లా అధ్యక్షుడు సింపుల్ రాథోడ్**

**గద్వాల ప్రతినిధి,మార్చి 15 ప్రభాతవార్త :** అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ కన్వీనర్ సింపుల్ రాథోడ్, తెలంగాణ వినియోగదారుల ప్రెసిడెట్ అంబు రాథోడ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. అంబు రాథోడ్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకు వినియోగదారుల ఫోరంను సంప్రదించాలని బుధవారం మార్చి 15 ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సమాజంలో జరుగుతున్న కల్తీ మానవ జీవనానికి అవసరమయ్యే ప్రతి వస్తువుపై మోసాలు, వస్తు ఉత్పత్తిలో నాణ్యతలోపం, ఆభరణాల కొనుగోలు విషయలో నాణ్యతలోపాన్ని గుర్తించడానికి బిఐఎస్ హాల్ మార్క్ కలిగిన ఆభరణాలను మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రసీదు పొందాలని అన్నారు. నాసిరకం అనిపిస్తే వెంటనే హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని కన్స్యూమర్ హెల్ప్‌లైన్ 180042500333, 18004254614 కల్తీ సర్వమయం తెలుసుకోకపోతే చావు ఖాయం. మోసపోవద్దు, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న సూపర్ మార్కెట్ల దోపిడిని తెలుసుకోవాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రిలో మోసాలు, ప్రజల చావులకు నిలయాలు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ ప్రోత్సాహం లక్ష్యంగా సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిపిపిఎ) సంప్రదించండి. కార్యక్రమంలో సింగర్ జయరాజ్, ఎస్.హాజమ్మ, వేణుగోపాల్, జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు పి. చిన్నికృష్ణ, జనరల్ సెక్రెటరీ జి. వెంకటేశ్వర్లు, ఆయా జిల్లాల వినియోగదారుల ఫోరం అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు, ఉపాధ్యాక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం జరుపుకుంటున్న దృశ్యం

# ఫీజు కోసం హాల్ టికెట్స్ ఇవ్వని వారిపై చర్యలు తీసుకోవాలి..

**వనపర్తి టౌన్,మార్చి 15 ప్రభాతవార్త:**వనపర్తి జిల్లాలో ప్రైవేటు స్కూల్స్ ఫీజులు కోసం 10వ తరగతి హాల్ టికెట్స్ ఇవ్వకుండా విద్యార్థులను మానసికంగా ఇబ్బందిగా పెట్టిన స్కూల్ యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు ఎం.ఎ ఖాదర్ పాష, జిల్లా కలెక్టర్ ను ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిర్లక్ష్యం వల్ల స్కాలర్ షిప్ ఫీజు, రీయంబర్స్‌మెంట్ ఆగడం వల్ల విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన అన్నారు. ప్రైవేటు స్కూల్‌లో నిరుపేద కుటుంబాల పిల్లలు చాలా ఉన్నారని 10వ తగరతి హాల్ టికెట్స్, సర్టిఫికేట్స్ ఇవ్వకుండా ఏ ఒక్క విద్యార్థికైనా అన్యాయం జరిగితే ప్రైవేటు స్కూల్స్ ముందు ఆందోళన చేస్తామని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వనపర్తి జిల్లాలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులను విహారయాత్రకు తీసుకుపోయేటప్పుడు డీఈఓ కు సమాచారం ఇచ్చి తీసుకెళ్లాలని నిబంధన ఉన్న నిబంధనలనె గాలి వదిలేసి అధికారుల అండదండలతో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోని విద్యార్థులను విహార యాత్రలకు తీసుకు వెళ్లినచో అనుకోని సంఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాంటి ప్రైవేటు స్కూల్, కళాశాలపై జిల్లా కలెక్టర్, డీఈఓ నిరంతరం తనిఖీలు నిర్వహించాలని అదే విధంగా ప్రైవేటు స్కూల్ ఆవరణలో 1నుండి10వ తరగతి వరకు ఫీజుల వివరాలు బోర్డుపై ఉంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..

**వనపర్తి టౌన్,మార్చి 15 ప్రభాతవార్త:** కార్మికులకు, కూలీలకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న తీరును ఎండగట్టేందుకు ఏప్రిల్ 5వ తేదీన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వనపర్తి జిల్లా రైతు సంఘం కార్యదర్శి పరమేశ్వర చారి, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ మండలంలోని కిష్టగిరి దొరబై తాండ, సవాయిగూడెం, నాచహళ్లి గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. గురువారం వనపర్తి సీఐటీయు ఆఫీసులో వనపర్తి మండల సదస్సుకు రావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరచారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించేది మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువస్తే రైతులు ఢిల్లీలో 14నెలల పాటు ఎండకు ఎండుతూ వానకు నానుతూ తీవ్రమైన చలిలో ఉంటూ సుమారు 670మంది రైతులు చనిపోయిన, రైతులకు వ్యతిరేకమైన చట్టాలను వెనక్కి తీసుకోవాలని రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ప్రకటించాలని ప్రభుత్వం ప్రకటించిన రేటు 50% అదనంగా రైతులకు ఇవ్వాలని కంపెనీ వ్యవసాయంతో రైతులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని అన్నారు. రైతులు పండించే పంటలకు వాడే కరెంటు మోటర్లకు మీటర్లకు పెట్టాలనే ఆలోచన వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఢిల్లీలో రైతులు ధర్నా చేస్తున్నప్పుడు రైతులకు తాగడానికి నీళ్ల లేకుండా రైతులు ధర్నా చేయకుండా రోడ్లపై మేకులు కొడుతూ ఎన్నో ఇబ్బందులు కేంద్ర ప్రభుత్వం పెట్టిన మేము రైతులకు న్యాయం జరిగే వరకు ఇక్కడ నుంచి వెళ్లేది లేదని చెప్పి ఢిల్లీలో ధర్నా చేస్తుంటే అప్పుడు నరేంద్ర మోదీ దిగివచ్చి, ఈ మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంటానని చెప్పి నేటి దాక పార్లమెంట్ లో అమలు చేయలేదని అన్నారు. ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో భారీ ర్యాలీ హాజరుకావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, రైతులు శ్రీనివాస్ రెడ్డి, నరసింహ, చిన్న, రాములు, వెంకటయ్య, నారాయణ, వ్యవసాయ కూలీలు, గ్రామపంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


రైతులతో కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

# దాతల సహకారంతో అన్నప్రసాద సత్రాన్ని సర్వాంగసుందరంగా సిద్ధం చేయాలి..

**వనపర్తి టౌన్,మార్చి 15 ప్రభాతవార్త:** అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు నగేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయప్రధాన కార్యదర్శి ముత్తు గురుస్వామి ఆలయ అభివృద్ధి కోసం పలు తీర్మానాలు ప్రవేశ పెట్టారు. ఖర్చులు, రాబడి గూరించి సభ్యులు చర్చ చేసి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మున్నూరు రవీందర్, వారి తల్లిదండ్రుల పేరు మీద నిర్మించిన ఆలయ మొదటి ముఖ ద్వారం ప్రారంభం సందర్భంగా వారిని అభినందించారు. ఈ సమావేశంలో మారం బాలీశ్వరయ్య, నరేందర్ గురుస్వామి, వెంకన్న, ప్రతాప్ రెడ్డి, చీర్ల కృష్ణ స్వామి, గోనూరు యాదగిరి, చీర్ల జనార్దన్, బంగారు అనిల్, నందిమల్ల అశోక్, గోపినాథ్, వెంకటేష్, పోతుల రాము, కమతం చెన్నయ్య, స్వాగత్ చందు, డా.బాలరాజు, ఆలయపూజారి, రమేష్ పాల్గొన్నారు.


అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**రూ.6319 ధర పలికిన కింటాల్ ఆముదాలు**

**దేవరకద్ర,మార్చి 14 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 8 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ. 6319 ధర పలికింది. అలాగే అతి తక్కువగా కూడ ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.అలాగే 412 కింటాళ్ళ ఉల్లిని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ ఉల్లికి అత్యధికంగా రూ.1320 ధర పలికింది. అతితక్కువగా రూ.1010 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## వివాహవేడుకల్లో పాల్గొన్న ప్రదీప్‌గౌడ్

**దేవరకద్ర,మార్చి 15 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గంలో బుధవారం జరిగిన పలు వివాహవేడుకల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధా నకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా నూతన వధూవరులను ఆయన ఆశిర్వదించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ఇంటర్ పరిక్షలు ప్రారంభం

**దేవరకద్ర,మార్చి 15 ప్రభాతవార్త:** దేవరకద్రలో బుధవారం ఇంటర్ పరిక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 598 విధ్యార్థులకు గాను 560 మంది విధ్యార్థులు పరిక్ష రాశారు. 30 మంది విధ్యార్థులు గైర్హాజరయ్యారు.

## మాజీ జడ్పీటిసి ఖగునాథ్‌రెడ్డిని పరామర్శించిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్

**ఇటిక్యాల,మార్చి 15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని షేక్‌పల్లి గ్రామానికి చెందిన ఇటిక్యాల మాజీ జడ్పీటిసి ఖగునాథ్‌రెడ్డి గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని బుధవారం ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ షేక్‌పల్లి గ్రామానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆరోగ్య విషయాలు, యోగక్షేమాలపై అడిగి తెలుసుకున్నారు.వీరివెంట అలంపూర్ తాలూకా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రవల్లి సర్పంచ్ రవి, అలంపూర్, ఉండవల్లి, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాము, గోపాల్ పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు

**మద్దూరు,మార్చి 15 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష రాస్తున్న కేంద్రాన్ని డిఈఓ సుదర్శన్‌రావు, ప్రతాప్‌రెడ్డిలు పరిశీలించారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గం.లలోపే విద్యార్థులు మొత్తం హాజరయ్యారు. అయితే 232 మంది విద్యార్థులు తెలుగు, హిందీ పరీక్ష వ్రాయడానికి అలాట్‌మెట్ చేయగా మొదటి రోజు 221 మంది విద్యార్థులు హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**వెల్దండ, మార్చి 15 ప్రభాతవార్త:**నిరుద్యోగులకు మద్దతుగా టీఎస్‌పీ ఎస్సీ కార్యాలయ ముట్టడి చేసిన యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్‌తో పాటు ఇతర నాయకులను అరెస్ట్ చేసి జైలులో పెట్టినందుకు రాష్ట్ర శాఖ పిలుపుమేరకు బుధవారం వెల్దండ మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షులు కంఠం రవికుమార్ మాట్లాడుతూ ప్రశ్న పత్రాలు లీక్ చేసిన వారిని కఠినం గా శిక్షించాలని, క్వాలీఫ్ అయిన వారందరికి న్యాయం చేయాల న్నారు. అరెస్ట్ చేసిన భానుప్రకాష్‌తో పాటు ఇతర నాయకులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ రేవల్లి మల్లేష్, నాయకులు రాజేందర్‌రెడ్డి, విష్ణుగౌడ్, బాలకృష్ణ, సంపంగి శివ, మురళి, లక్ష్మణ్, శివప్రసాద్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా...

**కల్వకుర్తి, మార్చి 15 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన పోలే బాలరాజు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పీఎసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, సుభాష్‌నగర్ కాలనీ వాసులు కనుక సత్యనారాయణ, పంబాల శేఖర్, రావుల శ్రీనివాసులు, చింత రవి, పంబల అంజన్, కుమార్, సామ బాలు, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.



# బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీల అవినీతి పాలనను తరిమికొట్టాలి

- అన్ని వర్గాల ప్రజలను ఆదరించేది కాంగ్రెస్ పార్టీ
- జోడోయాత్రలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**ఇటిక్యాల,మార్చి 15 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ బిజెపి పార్టీలు చేస్తున్న అవినీతి పాలన ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం అలాంటి పార్టీలను ఇక నుండి తెలంగాణలో తరిమికొట్టేందుకు ప్రజలు సిద్దంగా ఉండాలని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రజలకు వివరించారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని కొత్త దేవరపల్లి, నక్కల పల్లి, మునగాల గ్రామాలలో హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా పై గ్రామాలలో పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ అధికారంలోకి వచ్చాక ఏ ఏళ్లకాలం నుండి ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, రైతు రుణ మాఫీ, దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ వంటి పథకాలు ప్రజలకు ఏ ఒక్కటి పూర్తిగా అందలేదని మండిపడ్డారు. కేంద్రంలో బిజెపి పార్టీ కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తుందని అందుకే రెండు పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు చైతన్యం కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల పేద ప్రజలకు న్యాయం, సంక్షేమం అభివృద్ధి జరుగుతుందని 5 లక్షలతో ఇంటి నిర్మాణం, ఆరోగ్యశ్రీ కింద 5 లక్షలతో ఆరోగ్య సేవలు, ఒకేసారి ప్రతి రైతుకు 2 లక్షల రుణమాఫీ అర్హులైన వారికి ఇంట్లో ఇద్దరికి వృద్ధాప్య పింఛన్లు, రూ. 500లకే మహిళలకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ, కాంగ్రెస్ పార్టీ అందిస్తుందని కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు. బిఆర్ఎస్ పార్టీ పాలనలో విసుగు చెందిన ప్రజల కష్టాలు తెలుసుకుంటూ గ్రామాలలోని పలు కాలనీలలో ఉత్సాహంగా జోడో యాత్రను అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేపట్టే సంక్షేమం,అభివృద్ధి, ఉద్యోగాలు, కల్పన పరిశ్రమల ఏర్పాటు వంటివి స్పష్టంగా జోడోయాత్రలో ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతు న్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుక్మానందరెడ్డి, అలంపూర్ తాలూకా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి సర్పంచ్ రవి, నాయకులు జైపాల్‌రెడ్డి,హుస్సేన్, రాజు,సూరెడ్డి,రాజు, రఫిక్ పాల్గొన్నారు.


జోడో యాత్రలో మహిళలతో మాట్లాడుతున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

# వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నర్సరీలను కాపాడాలి

- వనపర్తి జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్

**వనపర్తి ప్రతినిధి,మార్చి 15 ప్రభాతవార్త:** వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నర్సరీలను కాపాడాలని జిల్లా కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసీ సమావేశ మందిరంలో ఎంపీడీలతో ఉపాధి హామీ పనుల నర్సరీల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధిహామీ పనులలో కూలీలను మొబలైజేషన్ చేయాలని అన్నారు. ప్రతి మండలంలో రోజుకు 1వెయ్యి మంది కూలీలు పనులకు వెళ్లేలా చూడాలని అన్నారు. వేసవిలో నర్సరీ మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టించాలని, షెడ్డు నెట్ ఏర్పాటు చేసి మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. జీవామృతం తయారు చేసి వాటి ద్వారా మొక్కలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సీడ్ బాల్స్ తయారు చేసి మొక్కలు ప్లాంటేషన్ జరిగేలా చూడాలని అన్నారు. అమృత్సర్ ఓవర్ ద్వారా నీటి సంరక్షణ చర్యలు సంబందిత నీటిపారుదలశాఖ అధికారులు చూడాలని అన్నారు. రికార్డుల నిర్వహణ, నర్సరీల పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఆధార్ సీడింగ్ చేయాలని అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ పై చర్చించారు. ఎఫ్‌టీఓ జనరేట్ చేయాలని అన్నారు.జాతీయ పంచాయితీ అవార్డు సర్టిఫికేట్ అందజేసేలా ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ లకు జియో సిమ్ ను కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ శ్రవణ్ కుమార్, డీఆర్డీఓ నరసింహులు, డీపీఓ సురేష్, డిప్యూటీ సీఈఓ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్

## ఘనంగా కాన్షిరాం జయంతి



**ఇటిక్యాల,మార్చి 15 ప్రభాతవార్త:** రాజ్యాధికారమే బీఎస్పీ పార్టీ అంతిమ లక్ష్యమని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇంచార్జి ఎంజి కృష్ణ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షిరామ్ 89వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి ఎంజి కృష్ణ మాట్లాడుతూ దేశంలో 85 శాతానికిపైగా ఉన్న బహుజనులు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని, ఓట్లు మావే సీట్లు మావే నినాదంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో రాజ్యాధికారాన్ని సాధించిన బహుజన యోధులుమాన్యశ్రీ కాన్షిరాం అనిఆయన సేవలను కొనియాడారు. పేద కుటుంబంలో జన్మించి కాన్షిరాం బహుజనులకు బహుజన సమాజ్ పార్టీ అనే ఒక రాజకీయ పార్టీని ఏర్పాటుచేసి కాంగ్రెస్,బిజెపి పార్టీలకు సవాల్ విసిరిన రాజకీయ మేధావి కాన్షీరామ్అని ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యస్థాపన చేయడానికి బహుజనులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉపేందర్, సెక్టార్ కమిటి సభ్యులు సేతురాజు, వినోద్, రాంబాబు, బీసన్న, వరదరాజు, జయన్న, రత్నం తదితరులు ఉన్నారు.

## మార్గ మధ్యలోనే నిలిచిపోయిన బస్సు

**ఉట్కూర్,మార్చి 15 ప్రభాతవార్త:** నారాయణపేట నుండి మక్తల్‌కు వస్తున్న ఆర్టీసి బస్సు నం.ఎపి 29 జడ్ 0903 బస్సు ఉట్కూర్ మండల కేంద్రం స్టేజీ సమీపంలో నిలిచిపోవడం జరిగింది. ఈ బస్సులో దాదాపు 44మంది ప్రయాణీకులు ఉన్నట్లు ఆర్టీసి కండక్టర్ తెలిపారు. స్థానికులు, ప్రయాణీకులు మాట్లడుతూ కాలం చెల్లిన బస్సులు ఆర్టీసి నడపడం వల్లే తరచూ ఇలా వాహనాలు చెడిపోతున్నాయని ఆర్టీసి అధికారులు కాలం చెల్లిన బస్సులను తీసివేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.


బస్సు మధ్యలోనే ఆగిపోవడంతో దిగివెళుతున్న ప్రయాణీకులు

## కందూరు రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి రూ.1లక్ష విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు రూ.1లక్ష చెక్కును అందజేస్తున్న దాతలు

**అడ్డాకుల,మార్చి 15 ప్రభాతవార్త:** అడ్డాకుల మండల పరిధిలోని కందూరు గ్రామ శివారులో ప్రకృతి ఒడిలో వెలసిన శ్రీ కందూరు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి గర్భాలయం ముఖ ద్వారం పంచలోహంతో నిర్మించడానికి కీర్తిశేషులు బొడ్డు బుచ్చారెడ్డి, జ్ఞాపకార్థం వారి కుమారులు బొడ్డు అశోక్ రెడ్డి, బొడ్డు శ్రీనివాస్ రెడ్డి రూ.1లక్ష చెక్కు ఆలయ కమిటీ చైర్మెన్ రమేష్ గౌడ్ కు అందజేశారు. శ్రీస్వామి వారి గర్భాలయం ద్వారం పంచలోహంతో నిర్మించడానికి అంచనా వ్యయం రూ.4లక్షలు కావున భక్తులు బ్రహ్మోత్తర కార్యక్రమంలో పాల్గొని రామలింగేశ్వర స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ చైర్మెన్, కార్యవర్గ సభ్యులు తెలిపారు.

## రెండో విడత కంటి వెలుగు ప్రారంభం


కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

**అడ్డాకుల,మార్చి 15 ప్రభాతవార్త:** అడ్డాకుల మండలం పెద్దమునగచేడు గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ విజయలక్ష్మీ, ఎంపిటీసీ చంద్రయ్య సాగర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయితీ సెక్రటరీ శిరీష, డాక్టర్ల బృందం, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: ఎస్సై

**పెబ్బేరు,మార్చి 15 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై జగదీశ్‌రెడ్డి సూచించారు. బుధ వారం పెబ్బేరులోని శ్రీకృష్ణవేణి హైస్కూల్ లో 14వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగ ఎస్సై జగదీష్ రెడ్డి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువతో పాటు క్రీడల్లో, సోషల్ అవెర్నెస్ అదేవిధంగా సెల్ ఫోన్ ద్వారా అనవసరమైన విష యాలను తెలుసుకోకుండా అవసరమైన విషయాలను తెలుసుకోకుండా చదువు కు సంబందించిన విషయాలను మాత్రమే వాడాలని అదేవిధంగా ఈ ఫోన్ వాడకం గురించి తల్లిదండ్రులు కూడా గమనించాలని తెలిపారు. ఆర్ఎస్ఎస్ వనపర్తి జిల్లా కార్యవాహ నాగకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను, తల్లిదండ్రులు సుఖంగా మాత్రమే ఉండాలని కోరుకోవడం కాదని, పిల్లలందరికి కష్టసుఖాల గురించి మన పూర్వీకుల గురించి అదే విధంగా ప్రబావంతమైన కథల గురించి తరచుగా విద్యార్థులకు, పిల్లలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతికకార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.అనేక రకాలైన సినిమా ఫోక్, జానపద గేయాలకి విద్యార్థులందరు నృత్యాలు చేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్, కరెస్పాండెంట్ ఎం.రాఘు వేందర్‌గౌడ్, అధ్యాపకబృందం, విద్యార్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై జగదీశ్ రెడ్డి

## లోకేష్ యువగళం పాదయాత్రలో రామన్‌గౌడ్

**పెబ్బేరు,మార్చి 15 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువనేత నారా లోకేష్ పాదయాత్ర సంపూర్ణంగా విజయవంతం కావాలని శ్రీశైలం దేవస్థానంలో నారాలోకేష్ పేరుతో ప్రత్యేకంగా పూజలు చేయించి చండీ హోమం విభూతి, బ్రహ్మరంబాదేవి, కుంకుమార్చన చేయించి, శ్రీశైలం దేవస్థానం క్షేత్రపాలకుడు శ్రీభైలు వీరభద్రస్వామి దగ్గర త్రిశూలం ను ప్రత్యేకంగ పూజ చేయించి చిత్తూరు జిల్లా తంబలపల్లి గుట్టవారిపల్లి గ్రామంలో పాదయాత్రలో కలిసి ఇవ్వడం జరిగిందని టీడీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రామన్ గౌడ్ తెలిపారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు వస్తున్న మీకోసం పాదయాత్రలో కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువగళం పాదయాత్ర 43వరోజు విజయవంతంగా సాగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాదేపల్లి రాజుగౌడ్, బ్రహ్మం, శ్రీరామ్, రామచందర్ పాల్గొన్నారు.



# ప్రశ్నా పత్రాలు లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

**ఇటిక్యాల,మార్చి 15 ప్రభాతవార్త:** వివిధ పోటీ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ప్రశ్నా పత్రాలు లీకైన పరీక్షలన్నీ వెంటనే రద్దు చేయాలని లీకేజీ వ్యవహారంలో సహకరించిన అధికారులు, పాలకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వమే నైతికబాధ్యత వహించి ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా బీఎస్పీ పార్టీ జిల్లా ఇంఛార్జి ఎంజి కృష్ణ, నాయకులు కేశవరావు, మహేష్, మణికుమార్‌లు డిమాండ్ చేశారు. బుధవారం బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో అలంపూర్ చౌరస్తాలో పోటీ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంపై కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి ఎంజి కృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ ప్రక్రియలో అవకతవకలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని లేనిపక్షంలో బిఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రశ్నాపత్రాలలో లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వం మౌనంగా ఉండడం పట్ల ఆ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ నిరసన కార్యక్రమంలో బిఎస్పీ పార్టీ నాయకులు రాంబాబు, రేపల్లెరాజు,సురేష్, జిల్లా మహిళాకన్వీనర్ అశ్విని,అలంపూర్ నియోజకవర్గ మహిళా కన్వీనర్ నాగజ్యోతి, రవిచందర్,తలపు నియోజకవర్గంలోని ఏడు మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పోటీ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంపై నిరసన చేపడుతున్న బీఎస్పీ పార్టీ నాయకులు

## ప్రి స్కూల్ మేళా


అంగన్‌వాడీ కేంద్రంలో ప్రి స్కూల్ మేళా నిర్వహిస్తున్న దృశ్యం

**ఉట్కూర్,మార్చి 15 ప్రభాతవార్త:** మండల కేంద్ర పరిధిలోని తిప్రస్‌పల్లి గ్రామంలో సర్పంచ్ సుమంగళ ఆధ్వర్యంలో అంగన్‌వాడి 12 సెంటర్ల ప్రీస్కూల్ మేళ నిర్వహించారు. ఇందులో భాగంగా సూపర్‌వైజర్ వైష్ణవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గీత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ వేషధారణలో అందరి చూపులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్రవంతి, సునంద తదితరులు పాల్గొన్నారు.

# నిఖిత కుటుంబానికి న్యాయం చేయాలి

**నిఖిత మృతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి: కాంగ్రెస్,ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్**

**లింగాల,మార్చి 15 ప్రభాతవార్త:** అభం, శుభం తెలియని ఏడవ తరగతి చదువుతున్న నిఖిత మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి మృతికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు కాశన్న యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేసి ఏకలవ్య చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యువజన సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు కాశన్న యాదవ్ మాట్లాడుతూ గత కొద్దిరోజుల క్రితం మన్న నూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో తరగతి గదిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. మన్ననూరు గురుకుల బాలికల పాఠశాలలో నిచత ఏడవ తరగతి బాలిక ఎలా చనిపోయిందని, నిజ నిజాలు బయటకు రావాలని డిమాండ్ చేశారు. అభం శుభం తెలియని ఏడవ తరగతి చదువుతున్న బాలికపై లేనిపోని ఆరోపణలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. న్యాయం అనేది ఒకేలా ఉండాలని, ఎమ్మెల్సీ కవిత విషయంలో స్పందించిన రాష్ట్ర మహిళా కమిషన్ మన్ననూరు గురుకుల బాలిక నిచత మృతిపై, మెడికో ప్రీతి విషయంలో ఎందుకు స్పందిం చలేదని ప్రశ్నించారు. నిచత డెడ్ బాడీని రీపోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్, నాగర్‌కర్నూల్ ఎంపి రాములు నిఖిత కుటుంబానికి న్యాయం జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ నాయక్, శంకర్ నాయక్, విజయ్, జగదీష్, మహేష్, లక్ష్మీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

## పేపర్ లీకేజీలు కావడం ప్రభుత్వం వైఫల్యమే

- కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఎండి సలీం



**మక్తల్,మార్చి 15 ప్రభాతవార్త:** తెరాస ప్రభుత్వం వైఫల్యం వల్లనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్స్ ఉద్యోగాల పరీక్ష పేపర్లు లీకేజీలయ్యాయని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఎండి సలీం ఆరోపించారు. బుధవారం స్థానిక డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పేపర్లు లీకేజీలు అయ్యాయన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎంతో కట్టుదిట్టంగా ఎలాంటి లోపాలు లేకుండా గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తే నేటి తెరాస ప్రభుత్వంలో అధికారులే అక్రమలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోంది,పేపర్ల లీకేజీ వ్యవహారంపై భవిష్యత్తు పరిణామాలపై నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్, కార్యదర్శినివెంటనే సస్పెండ్ చేయాలని అదేవిధంగా కెసిఆర్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు నిర్వహించిన అన్ని పోటీ పరీక్షలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.

# వినియోగదారుల చైతన్యంతోనే మోసాలను నియంత్రించవచ్చు

- మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రవికుమార్

**వనపర్తి రూరల్,మార్చి 15 ప్రభాతవార్త:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వనపర్తి వారి ఆదేశానుసారం వినియోగదారుల చైతన్యంతోనే మోసాలను అరికట్టవచ్చని వనపర్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రవికుమార్ అన్నారు. ప్రపంచవినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దత్తాయిపల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. వస్తువుల కొనుగోలులో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినియోగదారులకు అన్యాయం జరిగితే వినియోగదారుల పోరాన్ని ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని అన్నారు. లోక్ అదాలత్, ఉచిత న్యాయం,న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మహిళలు పొందవచ్చని, పిల్లలను బాగా చదివించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలోన్యాయవాదులు తిరుపతయ్య, కృష్ణయ్య, ఎస్ఐ రామ రాజు, అనేక చట్టాల గురించి వివరించారు. శాంతి భద్రతల పట్ల ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్‌కోర్టు సిబ్బంది,పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రవికుమార్

## అధ్వాన్నంగా వీపనగండ్ల రోడ్ల పరిస్థితి

**వీపనగండ్ల,మార్చి 15 ప్రభాతవార్త:** మండలం కేంద్రంలోని నరసింహ నగర్ గుడి నుండి 6వ వార్డు కింద రోడ్డు వరకు డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గాలేక నీళ్లన్నీ రోడ్డు మీదకు చేరి రోడ్లు అద్వాన్నంగా ఉన్నాయని ప్రజలు ఆరోపి స్తున్నారు. ఇప్పటే ఈ రోడ్డు రెండుసార్లు సీసీ రోడ్డు వేసిన నాసిరకమైన సిమెంట్, కంకర వాడడం వల్ల రోడ్డు లేదు అన్నట్టుగా తయారైంది.ఒక పక్క ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేస్తున్న 6వ వార్డు రోడ్లపరిస్థితి మాత్రం చాలా దయనీయంగా తయారైందని ప్రజలు వాపోతున్నారు. 6వ వార్డు ప్రజలే నరసింహబోర్డు నుంచి కింద బీసీ కాలనీ వరకు రోడ్డుమీదనుంచి వచ్చే నీళ్లను, డ్రైనేజీకి మళ్లించి, సీసీ రోడ్డు వేయాలని వార్డు ప్రజలు అంటున్నారు. సమస్య గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, అధికారులు త్వరగా స్పందించి రోడ్డు బాగుచేయాలని కోరారు.


రోడ్డుపై పారుతున్న నీళ్లతో అధ్వాన్నంగా మారిన 6వ వార్డు

# విశ్రాంతి ఉద్యోగులందరికి పెన్షన్ అమలు చేయాలి

**వనపర్తి టౌన్,మార్చి15 ప్రభాతవార్త:** జాతీయ సంఘర్షణ సమితి పిలుపు మేరకు బుధవారం వనపర్తి టీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ నుండి రాజీవ్ చౌక్ వరకు 250మంది విశ్రాంతి ఉద్యోగులు నల్లబ్యాడ్జీ లు, ప్లె కార్డులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1995 హైయర్ పెన్షన్ అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పెన్షన్ లేని విశ్రాంతి ఉద్యోగులందరికి పెన్షన్ సౌకర్యం వెంటనే అమలు పరచాలని తీర్పు ఇచ్చిన ఇంత వరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని తాత్సారం చేయడం వల్ల నేడు దేశ వ్యాప్తంగా రాస్తారోకో, నిరసన కార్యక్రమం నిర్వహించామని వారుఅన్నారు.నిరసలో భాగంగా వనపర్తి,గద్వాల, కొల్లాపూర్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.సత్యన్న,జిల్లా అధ్యక్షులురాంరెడ్డి, ప్రధానఉపాధ్యక్షులు కె.రామచంద్రారెడ్డి, సలహాదారు రాఘవరెడ్డి, కార్యదర్శి ఆర్.అంజయ్య,గోపాల్ రావు, ఎన్.శ్రీనివాసులు, ఎం.ఎస్ గౌడ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు

## 2వ విడత కంటి వెలుగు ప్రారంభం

**వీపనగండ్ల,మార్చి 15 ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో గల తూముకుంట గ్రామంలో రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అందరికి చూపు ఉండాలని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని తూముకుంట ప్రజలు అందరుసద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డా.వంశీకృష్ణ కోరారు. కంటి చూపు సమస్యలను బట్టి కంటి అద్దాలు కూడా ఉచితంగా అందిస్తామనిఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆశ వర్కర్లు, స్టాఫ్ నర్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేత

**వీపనగండ్ల,మార్చి 15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో గతవారం వడ్డె సంపంగి రంగయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషాదంలో ఉన్న కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ తరుపున రూ.5వేల ఆర్థికసాయం ట్రస్ట్ ఛైర్మెన్ డా.ఇంద్రకంటి వెంకటేష్ చేతులమీదుగా అందించడం జరిగింది, ఈ సందర్భంగా రంగయ్య బంధువులు మాట్లాడుతూ ఇంద్రకంటి వెంకటేష్ మాకు ఆర్థిక సహాయం అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడత దప్పు కురుమయ్య, గోవుల నాగరాజు, ఈదరాజు, వడ్డెకృష్ణయ్య తదితరులు ఉన్నారు.



## అక్రమ అరెస్టులకు భయపడం

**- భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా ఇన్‌చార్జి బండి దీక్షిత్**



సమావేశంలో మాట్లాడుతున్న బండి దీక్షిత్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 15, ప్రభాతవార్త:** టీఆర్ఎస్‌లో ప్రశ్నించేవారిపై అణిచివేత ధోరణిని కొనసాగుతుందని, అక్రమ అరెస్టులకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు భయపడరని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా ఇన్‌చార్జి బండి దీక్షిత్ అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ ను వెంటనే విడుదలచేయాలని కోరారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, నవీన్‌రెడ్డి, ప్రవీణ్, కే చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మొదటి రోజు ప్రశాంతం

**- 8839 మంది విద్యార్థులకుగానూ 8578 మంది విద్యార్థులు హాజరు**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 15, ప్రభాతవార్త:** ఇంటర్ పరీక్షలో మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. సమయంలోపు వచ్చిన విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. మొత్తం 8839మంది విద్యార్థులకుగానూ 8578 మంది హాజరుకాగా 261 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోరులో 2081 మందివిద్యార్థులకుగానూ1922మంది హాజరయ్యారు. మొత్తంగా 10,920 మందికిగానూ 10500 మంది హాజరుకాగా, 420మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తెలిపారు. విద్యార్థులు ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడలేదని తెలిపారు.

## మంత్రి నిరంజన్ రెడ్డిని కలిసిన దొడగుంటపల్లి బీఆర్ఎస్ నేతలు



మంత్రిని కలిసిన దొడగుంటపల్లి బీఆర్ఎస్ నేతలు

**పెద్దమందడి, మార్చి 15 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో పెద్దమ్మ దేవత దగ్గర తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మంత్రి సతీమణి వాసంతి అమ్మవారికి మొక్కులు సమర్పించిన అనంతరం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడంతో వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి గ్రామ బీఆర్ఎస్ నేతలు పాల్గొని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని కలిశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కోలుకోవాలని అమ్మవారిని ప్రార్థించారు. మంత్రి కలిసిన వారు కొను శ్రీనివాస్ రెడ్డి, శేఖరా చారి, సురేష్, కొరపాటి శేఖర్, మధులత, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీ కొని ఇద్దరికి గాయాలు

**పెద్దమందడి, మార్చి15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో ట్రాక్టర్ డీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మేస్త్రీ బాలస్వామి, బోయ యాదమ్మ బైక్ పై వెళ్తుండగా వెల్టూరు గోపాలసముద్రం చెరువు నుంచి ఒండ్రుమట్టి తరలిస్తున్న డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్ల ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. యాదమ్మ కు తీవ్ర గాయాలు, మరొకరికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కొత్తకోట లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు స్తానికులు తెలిపారు. ఈ విషయం ప ఎస్సై హరిప్రసాద్ ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.

## పాఠశాలకు వెళ్లేదారి మూసివేత



పాఠశాలకు వెళ్లే దారి మూసివేసిన దృశ్యం

**మహ్మదాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నంచర్లలో ప్రాథమిక పాఠశాల, ఉన్నతపాఠశాల ఒకే దగ్గర ఉన్నాయి. గతంలో ప్రాథమిక పాఠశాలకు, ఉన్నత పాఠశాలకు వేర్వేరుగా దారులు ఉండేవి. మన ఊరు మన బడి కార్యక్రమంలోభాగంగా పాఠశాలకు అదనపు గదులతోపాటు ప్రహరీగోడ నిర్మాణానికి అనుతులు లభించడంతో ప్రాథమిక పాఠశాలకు వెళ్లేదారిని మూసి గోడ నిర్మించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులువెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులకు, బియ్యం రావాణా చేసేవారి వాహనాలు రావడానికి ఇబ్బందులు అవుతాయని కాంట్రాక్టర్‌కు విద్యా కమిటి చైర్మన్‌కు విన్నవించిన వారు పట్టించుకోకుండా గోడ నిర్మించారని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భీంరెడ్డి తెలిపారు.

## అంధత్వ రహిత సమాజ నిర్మాణానికి కంటి వెలుగు

**కల్వకుర్తి, మార్చి 15 ప్రభాతవార్త:** అంధత్వ రహిత సమాజ నిర్మాణం చేపట్టాలనే రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిం చిందని ఎంపీపీ సామ మనోహర చెన్నకేశవ పేర్కొన్నారు. కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామంలో గ్రామ సర్పంచ్ జ్యోతి రవీందర్‌తో కలిసి ఎంపీపీ సామ మనోహర చెన్నకేశవ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల న్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను, వన నర్సరీని, ఈజీఎస్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీటీసీ శంకర్‌నాయక్, ఉప సర్పంచ్, వైద్యాధికారులు, గ్రామ సెక్రటరి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

# ఆత్మీయులను కలుసుకునేందుకే సమ్మేళనం

- అభిమానులు, శ్రేభిలాషుల కుటుంబాలను ఒక చోట కలవడం ఎంతో సంతోషంగా ఉంది
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- హైదరాబాద్‌లో 10వేల మందితో మంత్రి నిరంజన్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనం



మంత్రి నిరంజన్ రెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి ప్రతినిధి, మార్చి 15 ప్రభాతవార్త:** హైదరాబాద్ కు బతుకుదెరువుకు వచ్చి వివిధ ప్రాంతాల్లో స్థిరపడి జీవనోపాధి కొనసాగిస్తున్న ఆత్మీయులను కలుసుకునేందుకే హైదరాబాద్ లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయంలో మంత్రి నిరంజన్ రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వనపర్తి నియోజకవర్గానికి చెందిన వారు హైదరాబాద్ లో వివిధ పనులు చేసుకొంటున్న దాదాపు 10వేల మందితో మంత్రి నిరంజన్ రెడ్డి ఆత్మీ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అభిమానులు, శ్రేయోభిలాషుల కుటుంబాలను ఒక చోట కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కరోన నేపథ్యంలో ఆగిన మొక్కులు అమ్మవారికి చెల్లించుకునే సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమెనమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, డా.అబ్రహం, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కసి రెడ్డి నారాయణ రెడ్డి, సురభి వాణి దేవి, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకటరామిరెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మెన్ రామకృష్ణ రెడ్డి, అగ్రోస్ చైర్మెన్ తిప్పన, విజయసింహారెడ్డి, జడ్పీ చైర్మెన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, మాజీ కార్పోరేషన్ ల చైర్మెన్లు బండారు భాస్కర్, అల్లిపురం వెంకటేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.



మంత్రి నిరంజన్‌రెడ్డితో వనపర్తి నియోజకవర్గ కార్యకర్తలు



పెద్దమ్మ గుడి ఆలయంలో బోనం సమర్పించేందుకు వెళ్తున్న మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి



పెద్దమ్మ గుడి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి

# విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరాలి

**● గద్వాల జిల్లా ఎస్పీ కె.సృజన**

**గద్వాల ప్రతినిధి, మార్చి 15 ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరాలని, ఎవరు కూడాబడి మానేసిపొలం పనులకు వెళ్లవద్దని, ఉపాధ్యాయులు అందిస్తున్న వెలుగులను స్వీకరించి భవిష్యత్ కళలను సాకారం చేసుకుని తల్లిదండ్రులకు అండగా నిలవాలని జిల్లా ఎస్పీ కె.సృజన విద్యార్థులకు సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గట్టు మండలం మిట్టదొడ్డి, చాగదోన, చిన్నోనిపల్లి, హిందువాసి గ్రామాలలోని 8 ప్రభుత్వ పాఠశాలలో 1700ల మంది విద్యార్థులకు లక్ష 40 వేల రూపాయల విలువగల జామెట్రీ బాక్సులు, కంపాస్ బాక్సులు, ఆయా స్కూల్స్‌కు క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్ బోర్డ్సు, రింగ్‌బాల్స్, స్కిప్పింగ్ రోప్స్‌ను జిల్లా ఎస్పీ విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ఒకప్పటిలాగా లేవని ఇప్పుడు అన్ని సౌకర్యాలతో మంచి నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కొనసాగుతున్నాయని, విద్యార్థులు, ఉపాధ్యాయులు అందిస్తున్న వెలుగులను స్వీకరించి పట్టుదల, ధృఢ సంకల్పంతో క్రమశిక్షణతో చదివి భవిష్యత్ కళలను సాకారం చేసుకోవాలని సూచించారు. ఎవరుకూడా బడి మానేసి పొలం పనులకు వెళ్లవద్దని అన్నారు. పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థుల పట్ల సోదరభావం మెలగాలని ఎవరు కూడా ఇంట బయట ఇతరులను లింగబేధంతో చూడవద్దని సూచించారు. పోలీస్‌శాఖ అందిస్తున్న వస్తువులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, అలాగే ఆట వస్తువులు వినియోగించుకుని క్రీడలలో రాణించాలని సూచించారు. కొందరు విద్యార్థులు ఒకసారి చెబితే గుర్తు పెట్టుకుంటారు. కొందరు రెండుసార్లకు, కొందరు పదిసార్లకు చెబితే గుర్తు పెట్టుకుంటారని ఎవరు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, నిత్యం సాధన చేస్తూ ఉంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని తద్వారా తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా విద్యార్థులతో ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయని ఎస్పీఅన్నారు. విద్యార్థులు భద్రతకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా మౌనం వీడి నిర్భయంగా బయటకు వచ్చి ఉపాధ్యాయులకు తెలియజేసి వేధింపుల నుండి బయటపడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో చదువులలో ప్రతిభ చూపిన విద్యార్థినీ, విద్యార్థులను జిల్లా ఎస్పీ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, గద్వాల సిఐ చంద్రశేఖర్, గట్టు ఎస్సై పవన్‌కుమార్, ఆయాపాఠశాలల హెచ్‌ఎంలు చంద్రశేఖర్, కురుమయ్య, జగదీశ్వర్, రుకంతుల్లా, అయ్యస్వామి, ప్రభాకర్, శ్రీవాణి, రాంబాబులు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంపాస్ బాక్సులు అందజేస్తున్న జిల్లా ఎస్పీ కె.సృజన

# మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలి

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 15 ప్రభాతవార్త:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య శాఖ పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం పాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ నాగర్‌కర్నూల్ జిల్లాలో అమలవుతున్న వైద్య మరియు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రోగ్రామ్ అధికారులు ఉప జిల్లా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు మెడికల్ అధికారులు ఆర్బీ ఎస్కే డాక్టర్లు మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో అర్హులైన వారందరిని గుర్తించి కంటి పరీక్షలు నిర్వహించి వారికి కంటి అద్దాలు, ప్రెస్క్రిప్షన్ గ్లాసెస్ ఇవ్వాలసిదిగా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నూతనంగా నిర్మించే ఆరోగ్య ఉప కేంద్రాలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వాటి మరమ్మత్తులపై సమీక్షించి వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలని, ప్రైవేటు ఆసుప్రతుల్లో జరుగుతున్న సీజేరియన్ సెక్షన్లను ఆడిట్ చేసి నివారించాలని కోరారు. చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి వారిలో ఉన్న లోపాలను గుర్తించి తక్షణమే సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో క్షయ వ్యాధుగ్రస్తులు పెరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి లక్షణాలున్న వారిని పరీక్షించి టీబీ వ్యాధిని నివారించాలని, వారికి అందజేస్తున్న ప్రోత్సాహకాలు వెంటనే బదిలీ చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రగతిలో రాష్ట్ర స్థాయిలో ముందుండాలని సూచించారు. గర్భిణీల్లో మహిళల రక్తహీనత శాతాన్ని తగ్గించేందుకు వైద్యశాఖ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుధాకర్ లాల, జాతీయ ఆరోగ్యకార్యక్రమ అధికారి రేణయ్య, డీఐవీఓ రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాసు, వైద్యులు తదితరులు ఉన్నారు.

# నిబంధనల ప్రకారం గృహ నిర్మాణం చేయాలి

**- కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం**




సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, మార్చి 15 ప్రభాతవార్త:** పట్టణంలో చేపడుతున్న నూతన గృహ నిర్మాణాలపై భవన నిర్మాణ కార్మికులకు, బిల్డర్లకు మరియు ఎల్టీపీలకు బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 మరియు టీఎస్ బిపాస్ 2020 చట్టం ప్రకారం అనుమతి పొందిన తర్వాత నిబంధనలకు అనుగుణంగా నూతనంగా నిర్మాణం చేయాలని కోరారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే నిర్మాణానికి అవసరమైన వస్తువులను ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా వేసి ప్రజలకు ఇబ్బందులకు కలిగిచకుండా మీ యొక్క స్థంలో వేసుకోవాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజలకు అతి సులువుగా ఉండే విధంగా అక్రమాలకు తావు లేకుండా చాలా అద్భుతమైన ప్రణాళికలు రూపొందించరాదని, ప్రజలు కూడా చట్టాలపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఆశిత్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి విజయ్‌కుమార్, కౌన్సిలర్ సైదులుగౌడ్, ఎల్టీపీలు మనోహర్‌రావు, సురేందర్, మహమూద్ అలీ, భవన నిర్మాణ కార్మికులు శ్రీనివాసులు, రాజు, జంగయ్య, ఉపేందర్, మల్లిఖార్జున, బిల్డర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# విఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**● విఓఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత**



**లింగాల, మార్చి 15 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి విఓఎల సమస్యలు వెంటనే పరిష్కరించి, అర్హులైన విఓఎలకు సిసిలుగా ప్రమోషన్ కల్పించాలని విఓఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న విఓఎలు మూడు రోజుల పాటు విధులు బహిష్కరిస్తున్నట్లు ఎపిఎం బాలస్వామికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విఓఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత మాట్లాడుతూ విఓఎల సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఏమి ప్రయోజనం లేకుండా పోయిందని, ప్రభుత్వ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విఓఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విఓఎలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. రూ. 10లక్షల సాధారణ భీమా, ఆరోగ్య భీమాసౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఓఎల మండల అధ్యక్షురాలు సరస్వతి, స్వాతి, సుల్తాన్ పాష, అలివేల, మంజుల, కవిత పాల్గొన్నారు.

## గుర్తు తెలియని కారు ఢీకొని ఇద్దరు రైతుల మృతి

(మొదటిపేజీ తరువాయి భాగం)

చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు పోలీసులు అందించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి భాగం)

కలిగి ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు చేసుకోవద్దని, ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు. పోక్సో యాక్టు గురించి వివరించారు. చదువుతోపాటు ఆరోగ్యం, మానసిక ఉల్లాసం ఎంతో అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శశికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కాన్షిరాం జయంతి

**పెబ్బేరు, మార్చి 15 ప్రభాతవార్త:** కాన్షిరాం 89వ జయంతి కార్యక్రమాన్ని పెబ్బేరు మండలంలో బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలోఘనంగా జరుపుకున్నారు. బుధవారం స్థానిక సుభాష్ చౌక్ లో కాన్సిరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ నాయకులు గడ్డం బాలస్వామి, వనపర్తి ఇంచార్జ్ గణపురం కృష్ణ హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలో మెజార్టీ ప్రజలను అధికారంలో కూరోచబెట్టిన రోజే ఈ దేశంలో సమానత్వం వర్ధిల్లుతుందని కనుక బహుజనులందరు చట్ట సభలో వారి జనాభా దామాషా ప్రకారం సీట్లు పొందిన రోజు ఈదేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కావున గ్రామస్థాయిలో బీఎస్పీ పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శ్రీరంగాపురం ఎంపీటీసీ గూడెం ఎల్లస్వామి, పెబ్బేరు మండల కన్వీనర్ గుడిసె రాంబాబు, మహిళ మండల కన్వీనర్ బండారి సుజాత, నాయకులు టి.అశోక్, మనోహర్, అరుణ్ కుమార్, సుబ్రమణ్యాం, గుమ్మడం వెంకటయ్య, రాజు, అంజి, ఆనంద్, సహదేవ్, గణపురం ఈశ్వర్, దినేష్, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.



కాన్షిరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు